
# ప్రేమపిలుస్తూ వచ్చింది

(గత సంచిక తరువాయి)



"ఆత నెవడు ?"—అని అధికారస్వరంతో అడిగాడు సుందరం.

"మా—మా మేనత్త కొడుకు, జ్యోతి!" అంది జంకుతూ.

తనకే నవ్వొచ్చింది, అల్లా చెప్పినందుకు.

"మనం ఏకాంతంగా మాట్లాడుకోవాలని నా ఉద్దేశం." అన్నాడు జ్యోతికేసి కళ్ళు సన్నంచేసి కోపంగా చూస్తూ.

ఇద్దరూ హాల్లో అవతల చివరికి వెళ్ళారు.

"రేఖా, నిన్నచెప్పిన సంగతి ఆలోచించావా?" అన్నాడు సీరియస్‌గా చూస్తూ.

ఎందు కాలోచించాలి, అనుకుంది రేఖ. నాలిక్కొరుక్కొని జాలిగా మందహాసంచేసి సుందరం కళ్ళల్లోకి చూసింది. కాని, ఆవి జ్యోతి కళ్ళంతనల్లగా, అంతే పర్యవసానం లేవు. మొహంలో మందహాసం మాయమయింది.

"ఏంసుందరం ఎదురుచెప్తున్నా ననుకోక ఒక్కమాట విను. ఇంకొక్కఏడేగా ఉంట. తరువాత నువ్వు చదవమన్నా చదవను. నీకంత అభ్యంతరంగా ఉంటే పోనీ ఒచ్చే ఏడు పెళ్లి చేసుకోవచ్చు" అంది ప్రార్థిస్తున్నట్లు చూస్తూ.

"వీల్లేదు....మా అమ్మ అంతా ఈ ఏడే అయిపోవాలంటోంది. పైగా పెళ్ళయిన తరువాత చదువుకోడం మా అమ్మకి యిష్టంలేదు!" అన్నాడు మూర్ఖంగా.

రేఖ కళ్ళల్లోకి వేడివేడి నీళ్ళు పొకాయి, "మీ అమ్మ నువ్వు గంగలోకి దిగండి!" అందాం అనుకుంది, సుందరం అంటే అసహ్యంవేసింది రేఖకి. అసలు ఎట్లా ప్రేమించానా అని ఆశ్చర్యపడింది. జ్యోతి జ్ఞాపకంవచ్చాడు.

"నే డీగ్రీపుచ్చుకుతీర్తాను!" అంది ఆవేశంతో.

"మనపెళ్ళి నిశ్చయంమాట జ్ఞాపకంఉండే మాట్లాడుతున్నావా?" అన్నాడు కోపంతో లేచినుంచుని.

"ఆ! తక్షణం మీ అమ్మ ఇంకోకోడలుకోసం వెతుక్కోవచ్చు—"

మొగాడిగొంతుకవిని గిరుక్కున తిరిగాడు, సుందరం. నిశ్చింతగా టీ తాగుతూ, గుమ్మంలో నిలబడ్డ జ్యోతిని చూశాడు.

"రేఖా!....ఇవి ఆయనకి సంబంధించిన విషయాలు కావని చెప్పు." అన్నాడు సుందరం, జ్యోతిని తినేశేలా చూస్తూ.

నన్నిల్లా ఆజ్ఞాపిస్తాడేమిటని విసుక్కుంది, రేఖ.

"జ్యోతీ!...." అంది బతిమాలుతున్నట్లు చూస్తూ.

"థేంక్సు!" అని సావకాశంగా సిగరెట్టుకాల్చుకుంటూ పక్కనున్న కుర్చీలో కూలబడ్డాడు.

సుందరానికి తరవాత ఏంచెయ్యాలో తోచలేదు.

"ఇది మన ప్రైవేటుగొడవ!—" అని పళ్ళు బిగ పెట్టి నుదురుకొట్టుగున్నాడు.

జ్యోతి ఇద్దరికేసి ప్రశాంతంగాచూసి, గాల్లోకి ఓరింగు వొదిలాడు.

"రేఖా, మీ ఇంటిపేరేమిటి—" అన్నాడు, సుందరం అసలు ఆ గదిలోలేనట్లు రేఖకేసిచూస్తూ.

"మీ, మేనత్తకొడుకనన్నావుగా?"—అన్నాడు సుందరం స్మశానం మొహంపెట్టి.

అనుమానంతో నిలబడిపోయింది, హృదయం; అసూయతో బిగుసుకుపోయాడు మనిషి. రేఖ తెల్లబోయి, సిగ్గుతో బుర్రవంచుకుని నిలబడింది. జ్యోతి ఏపిల్‌టక్కుమని కొరికాడు.

తలుపు ముక్కలయిపోయినట్లు ఫెడీమని చప్పుడయింది; సుందరం వెళ్ళిపోయాడు.

"సోలాంగ్!—" అంటూ జ్యోతికూడా మెల్లిగా మెట్లు దిగుతున్నాడు. రేఖకి ఏడవాలో, నవ్వాలో తెలియలేదు. తనకీ సుందరానికీమధ్య, అగ్గివుల్ల అంటించడంలో జ్యోతి ఉద్దేశం ఏమిటి? తనని ప్రేమిస్తున్నాడా?.... లేదు....తనంటె వేళాకోళం జ్యోతికి. జాలిపడ్తున్నట్లు చూస్తాడు, తోడేలుచూపు నాడూను. పచ్చిరోగ్! స్కౌండ్రల్! స్కౌండ్రల్! ....ఇంకా కోపం తీరలేదు రేఖకి. జ్యోతి కూర్చున్న కుర్చీని తోటలోకి విసిరేసింది, దాని వెనకాలే జ్యోతి వాడిన ప్లేట్లు, కప్పులు సమస్తం కిటికీ లంఘనం ఆచరించాయి. వొగరుస్తూ పక్కమీద పడుక్కుంది.

తలుపు చప్పుడయింది. సుందరమే అల్లా వేళ్ళతో కొడతాడు. క్షమించమని కోర్తాను. సుందరం అడిగినట్లే చేస్తాను. వొళగంతుతో తలుపుదగ్గిరికివెళ్ళి తలుపు తీసిం"! జ్యోతి!! కోపం ఆపుకోలేకపోయింది. ఉడుకుమోత్తనం ఊరిపోయి, మతి మాయంచేసింది. కణత పేల్చేద్దామని చెయ్యెత్తింది! జ్యోతి చురుకుచెయ్యి మధ్యలోనే నిలేచింది, రేఖ మెత్తటివేళ్ళని. రేఖ తెల్లబోయి చూసింది, జ్యోతికేసి.

"చెంపలు పేలగొట్టడంలో నీకు బొత్తిగా ప్రాక్టీసు లేదు, బేబీ!" అన్నాడు వెక్కిరిస్తున్నట్లు నవ్వుతూ. "అల్లా పోతోంటే జ్ఞాపకం వచ్చింది; నిన్ను ప్రేమిస్తున్నాను, రేఖా!"

ఇల్లాంటిప్రేమ ఎప్పుడూ కనీ, వినీ ఎరగదు, రేఖ. రోడ్డుమీద పోతూంటే జ్ఞాపకం వచ్చిందిట! జ్యోతి తనని ప్రేమిస్తున్నాడంటే గోషాగా సంతోషించిందిగాని, ....జ్యోతి పచ్చిరోగ్! తనని ఏడిపించడానికేఅన్నాడు!! అంతా అబద్ధం!!!

"జ్యోతీ నాచెయ్యి, వొదిలెయ్!—" అని డబ్బాని కొట్టి నట్టరిచింది.

"ఉష్!—" అని మందహాసంచేసి, గబుక్కుని తన బలమైనచేతుల్లోకి, కోలగా, పాండ్సుక్రీములాఉన్న ఆమె మొహాన్నిలాక్కుని, కోపంతో వొణికిపోతున్న ఆమె పెదవుల్ని, తన పెదిమల్తో బలంగా పరామర్శించాడు. రేఖకి స్వర్గంలో నాలుగోఅంతస్థులో ఉన్నట్టయింది. ఆనందంతో విడిపోయాయి, ఆమెపెదవులు. అంతవరకూ జ్యోతివీపుని పదహారుచెక్కలయ్యేలా బాత్తున్నచెయ్యి, జ్యోతిని దగ్గరికిలాక్కుంది, జ్యోతి, రేఖని వదిలిపెట్టగానే, చలిమిడిముద్దలా పక్కనున్న సోఫాలో కూలబడింది. జ్యోతికేసి పిచ్చిచూపుచూసి, నీరసంగానవ్వింది.

జ్యోతి విజయసూచకంగా మందహాసంచేసి వెళ్ళిపోయాడు.

మొర్నాడుసాయంత్రం అయిదవకుండానే వొచ్చాడు సుందరం,

"రేఖా! నిన్ను నేను పిచ్చికోపంలో చాలా అన్నాను, క్షమించవూ? ఏదో కొత్తవాడున్నాడుగదా అని అలా అనిపించింది. పెళ్లిమాత్రం ఈ ఏడే అయిపోవాలంది. మా అమ్మ. చదువుకుంటే చదువుకోమంది నిన్ను—" అంటూ మేడమెట్లకిందనించే చెప్పుకుంటూ వచ్చి జంకుతూ, జడుస్తూ, గబుక్కుని ముద్దెట్టుకున్నాడు. రేఖకి మైనబొమ్మని ముట్టుకున్నట్టే ఉంది. అసలు సుందరానిది

ఇంత గడ్డి బుర్రఅని, ఇంత చచ్చు మొగతనం అనీ, ఇంత అసహనంతో కూడుకున్న హృదయం అనీ ఊహిం చుకో లేకపోయింది తను। సుందరాన్ని చూస్తుంటే హృదయం చుట్టు రక్తం గడ్డకట్టుకు పోయినట్టయింది.

"సుందరం నే.... నేను—నిన్ను ప్రేమించటంలేదు" అంది సుందరం ఇచ్చిన వజ్రపుటుంగరాన్ని వేల్నించి తీసేస్తూ. ఆ ఉంగరం యజమానికి, గుండెలు మోకాళ్ల దాకా జారిపోయాయి.

"రే—రేఖా।—పోనీ, మన పరీక్ష లయిపోయిన తర్వాతే చేసుగోచ్చు అంది అమ్మ. దానికి ఇంత గొడ వెందుకు? అల్లా కేసినోకి పోదాం, రా।"

మేడమెట్లమీద బూటు చప్పుడయింది. జ్యోతి ఐతే, ఎంతబాగుండును అనుకుంది రేఖ. కాని జ్యోతి ఇంక రాడని తనకి తెలుసు. వాడిపని అయిపోయింది ఇక్కడ. తోడేలుజాతి।

నర్వస్‌గా గుమ్మంకేసి చూసింది. ఈలేసుకుంటూ గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు, జ్యోతి। ఇద్దరికేసీ ఓ మాటు సీరియస్‌గాచూసి, సోఫాలోకూచుని "కేప్‌స్టెన్" వెలిగించాడు.

"రేఖా।—" అన్నాడు ముక్కులోంచి మేషాలు తోల్తూ, "నిన్నరాత్రి ఫోంచేస్తోంటే జ్ఞాపకంవచ్చింది, నిన్న నీతో, అసలుసంగతి వొకటి చెప్పడం మరిచి పోయాను. నిన్ను—" అని దీర్ఘంతీస్తూ రేఖ కళ్ళల్లోకి తేలిగ్గా నవ్వాడు.

ఎండిపోయిన గుండెల్లో కొర కంచుదూర్చిన ట్లయింది రేఖకి. తనంటే అంతలోకువన్నమాట జ్యోతికి. జ్యోతికి కావలసింది తను సుందరంతో దెబ్బలాడ్డమేగా; ఉడుకు మొత్తనం కళ్ళలో నీళ్లు గిరగిరా తిప్పింది.

"సుందరం నీ ఉంగరం తీసుకుపోయి మీ అమ్మ కిచ్చెయ్యి।" అని బల్లమీద పడేసి రోషంతో జ్యోతికేసి చూసింది.

జ్యోతి మెచ్చుకుంటున్నట్లు మందహాసంచేసి, పీడ ఒదిలిపోయిందన్నట్లు సిగరెట్ ఏష్‌ట్రేలో పడేశాడు. రోషం ఏడుపులోకి దిగింది. తనమీద ఇంత కసి తీర్చుకో డానికి జ్యోతికి ఏం అపకారంచేసింది తను. కుళాయి నొక్కినట్లు, రేఖ కళ్ళల్లోంచి నీళ్ళు కారిపోతున్నాయి. సోఫాలో బోర్లాపడుక్కుని కసితీరా ఏడవడం మొదలు పెట్టింది.

మిస్టర్ సుందరం। ఆ ఉంగరం ముందర మీ అమ్మ కిచ్చేసిరండి. అది చాలా వేల్యుబుల్—" అన్నాడు అతి ముఖ్యమైన సలహా ఇస్తున్నవాడిలా మొహంపెట్టి.

సుందరం ఉంగరం నేల్నెట్టికొట్టి తినేసేలాగ చంద్ర మోహన్ కళ్ళతో జ్యోతికేసి చూశాడు. కాని జ్యోతి పెర్సనాలిటీ చూసి ఎందుకేనా మంచిదనుకుని, పళ్ళు పటపట కొరుకుతూ, ఓమాటు రేఖకేసి తిరిగి, "క్షణం లొంగే ఘటం కాను।" అన్నట్లు జ్యోతికేసి చూపు విసిరి, నిర్లక్ష్యంగా మెట్లు లెక్క పెట్టుగుంటూ కిందికి దిగిపోయాడు.

"రేఖా।—" అన్నాడు భుజంమీద చెయ్యేసి, జ్యోతి.

"నోర్మయి।...." రోషంతో వొణికిపోతోంది,

"రేఖా। నిజంగా నిన్ను ప్రేమిస్తున్నాను; నీకోసం నేను ఏమైనా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను.... నన్ను పెళ్ళిచేసుగుంటావా, రేఖా।" అని తన రెండు చేతు ల్లోకి పోగుజేసుకున్నాడు, రేఖ ముఖాన్ని.

రేఖ; నిశ్శబ్దంగా కళ్ళుపైకెత్తి, జ్యోతి కళ్ళలోకి చూసింది. ఆదరంతో ఆహ్వానించాయి, అవి. అది గుర్తించిన తనకళ్ళు మెరిశాయి. వొళ్ళు జలదరించింది, జ్యోతికి ఇంకా దగ్గిరగా జరిగి సమాధానంగా అతని ఉంగరాల జుట్టులో వేళ్ళెట్టి తృప్తిగా నవ్వింది.

తక్షణం జ్యోతి చేతులు, ఇంక ఊపిరి ఆడదేమో నన్నంత బలంగా, రేఖ సన్నటి నడుముని చుట్టేశాయి. ఆనందంతో నవ్వుతున్న జ్యోతి పెదవులు. రేఖ లేత గులాబీరంగు పెదవులమీదికి వంగుతూంటే, అమర సౌఖ్య వాహినిలో తేలుతున్న రేఖ హృదయంలోని మంగళ వాయిద్యాలు జ్యోతి హృదయంలో గూడా ప్రతి ధ్వనించాయి।